

హైదరాబాద్ వార్త

# అటోమేషన్.. ఎస్టిమేషన్

**టిఎస్ఐపాస్‌లో విద్యుత్ కనెక్షన్లు మరింత సులభం**

**కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా చర్యలు**

**కొత్తవిధానంతో ఎవరిఎస్టిమేషన్లు వారే వేసుకునే అవకాశం**

**సేవలను సులభతరం చేసేదిశగా టిఎస్ఎస్‌పిడిసిఎల్ చర్యలు**




హైదరాబాద్, జనవరి 25,ప్రభాతవార్త: టిఎస్ఐపాస్‌లో విద్యుత్ కనెక్షన్లు తీసుకునే విధానం మరింత సులభతరం చేసే దిశగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎస్పీడిసిఎల్)కొత్త విధానం అందుబాటులోకి తీసుకురాబోతుంది. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేట్ సిస్టం (టిఎస్ఐపాస్)లో పరిశ్రమల నిర్వాహాకులు విద్యుత్ కనెక్షన్లు తీసుకునేందుకు కావాల్సిన ఎస్టిమేషన్లు వాళ్లే అటోమేషన్ విధానంతో రూపొందించుకునే ప్రత్యేక విధానాన్ని త్వరలో ప్రారంభించనుంది. ఇప్పటికే అటోమేషన్ ఎస్టిమేషన్ విధానంపై డిస్కం పూర్తిస్థాయిలో ప్రత్యేక విధానం రూపొందించి క్షేత్రస్థాయిలో దాని పనితీరును పరిశీలిస్తుంది. ఇప్పటివరకు పరిశ్రమల నిర్వాహాకులు కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమలకు కావాల్సిన విద్యుత్ కనెక్షన్లు,లోడ్ సామర్థ్యం వంటి వివరాలతో విద్యుత్‌శాఖ అధికారులు నుంచి ఎస్టిమేషన్లు రూపొందించుకోవాల్సి ఉండేది. అలా అధికారులు ఎస్టిమేషన్లు రూపొందించి, కనెక్షన్లు మంజూరు చేసేందుకు ఎక్కువ సమయం పడుతుండటంతో ఆవిధానంలో మార్పులు తెచ్చి సేవలు మరింత సులభంగా, తక్కువ సమయంలో సేవలందించే దిశగా డిస్కం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొత్త కనెక్షన్లకు వేసే ఎస్టిమేషన్లకోసం వినియోగదారులు విద్యుత్ కార్యాలయాలు, అధికారుల దగ్గరకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో కనెక్షన్లకు దరఖాస్తు చేసుకుని తాము తీసుకున్న కనక్షన్ కేటగిరీ, లోడ్‌కు సంబంధించిన వివరాలతో తాము తీసుకునే విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన ఎస్టిమేషన్లు ఆన్‌లైన్‌లో రూపొందించుకునే అవకాశం వినియోగదారులకు కల్పించబోతున్నారు. ఈకొత్త విధానంతో పరిశ్రమలకు మరింత తక్కువ సమయంలో కనెక్షన్లు జారీ చేయడంతో పాటు పరిశ్రమల నిర్వాహాకులు ఎక్కడకు వెళ్లకుండానే విద్యుత్ కనెక్షన్లు తీసుకునే వెసులుబాటు కలుగుతుందని డిస్కం ఉన్నతాధికారులు చెబుతున్నారు. టిఎస్ఐపాస్‌లో విద్యుత్ కనెక్షన్లు తీసుకునే వారంతా అన్‌లైన్‌లో తమ పరిశ్రమలకు సంబంధించిన వివరాలు, కనెక్షన్ లోడ్, ఇతర వివరాలు నమోదు చేసుకుంటే చాలు వాళ్లకు సంబంధించిన ఎస్టిమేషన్లు ఆటోమెటిక్‌గా ఆన్‌లైన్‌లో వాళ్లకు కనిపిస్తాయి. ఆఎస్టిమేషన్లకు సంబంధించిన ఛార్జీలు విద్యుత్‌శాఖకు చెల్లించి కనెక్షన్లు తీసుకోవచ్చు. కనెక్షన్లు తీసుకున్న తర్వాత ఎస్టిమేషన్లలో ఏమైనా మార్పులు ఉండి ఎక్కువ,తక్కువ మొత్తం చెల్లించినా ఆచెల్లించని మొత్తాన్ని ఎక్కువతే వినియోగదారుడికి ,తక్కువైతే విద్యుత్‌శాఖకు చెల్లించేలా అధికారులు ఎస్టిమేషన్లలో మార్పులు చేసి సర్దుబాటు చేస్తారు. డిస్కం సాంకేతిక టెక్నాలజీ ఎప్పటికప్పుడు ఆప్‌డేట్ చేస్తూ వినియోగదారుల సేవలు మరింత సులభతరం చేసేదిశగా చర్యలు చేపడుతుందని డిస్కం ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**భవిష్యత్‌లో కమర్షిల్, డొమస్టిక్ కేటగిరీలో ఈవిధానం..** విద్యుత్‌శాఖలో పెద్ద సంఖ్యలో కొత్త కనెక్షన్లు వస్తున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఈవిధానం కమర్షియల్, డొమస్టిక్ కేటగిరీ కనెక్షన్లకు తీసుకువచ్చే అవాకాశాలను విద్యుత్‌శాఖ పరిశీలిస్తుంది. కొత్తటెక్నాలజీ ఉపయోగిస్తూ క్షేత్రస్థాయిలో అక్రమాలకు చెక్‌పెట్టడంతో పాటు అతితక్కువ సమయంలో కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రేటర్ జోన్‌లో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు భారీగా వెలుస్తున్న నేపథ్యంలో ఆన్‌లైన్ విధానంతో కనెక్షన్ల జారీ, ఎస్టిమేషన్లు రూపకల్పన విధానం అందుబాటులోకి తెస్తే తక్కువ సమయంలో పెద్దసంఖ్యలో కొత్త కనెక్షన్లు జారీ చేయవచ్చునని విద్యుతశాఖ భావిస్తుంది.

## విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణను త్వరగా పూర్తిచేయండి

**సిఎండీ ప్రభాకర్‌రావుకు విద్యుత్‌అకౌంట్స్ ఆఫీసర్స్ వినతి**



సిఎండీకి వినతిపత్రం ఇస్తున్న అంజయ్య, నాసర్‌షరీఫ్, అనురాధ, పరమేష్

హైదరాబాద్, జనవరి 25,ప్రభాతవార్త: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణను త్వరగా పూర్తి చేయాలని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ట్రాన్స్‌కో,జెన్‌కో సిఎండీ ప్రభాకర్‌రావును కోరింది. ఈమేరకు బుధవారం అసోయేషన్ ప్రధాన కార్యదర్శి పి. అంజయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సిఎండీని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను సిఎండీ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. సిఎం కెసిఆర్‌తో మాట్లాడి విద్యుత్ ఉద్యోగుల వేతనసరవణ పూర్తిచేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నాసర్ షరీఫ్, కొరడాల వెంకటేశ్వర్లు, అనురాధ, పరమేష్, స్వామి, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రాండ్ నర్సరీ మేళా

**నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వాహణ**

**ఐదురోజులపాటు సాగనున్న హార్టికల్చర్, అగ్రికల్చర్ ప్రదర్శన**

హైదరాబాద్, జనవరి 25,ప్రభాతవార్త: నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో గురువారం నుంచి 13వ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఆల్‌ఇండియా హార్టికల్చర్ అగ్రికల్చర్ షో అందుబాటులోకి రానుంది. ఐదురోజులపాటు జరిగే ఈషోలో వివిధ రకాల మొక్కలతో పాటు హార్టికల్చర్, అగ్రికల్చర్ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయాలు, తోటలు, ఆర్గానిక్ ఉత్పత్తులు ప్రదర్శిస్తారని మేళా ఇంచార్జ్ ఖాలీద్ అహ్మద్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కోల్‌కతా, ఢిల్లీ, హర్యానా, ముంబాయి, బెంగళూరు, పూణే, షిరిడి కడియం, చెన్నై డార్జిలింగ్, తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చిన ప్లాంట్లు 150కిపైగా స్టాల్స్‌లో ప్రదర్శిస్తారని తెలిపారు. ఇంపోర్టెడ్ ప్లాంట్స్,మెడిసినిల్ ప్లాంట్స్ కిచెన్, అవుట్ డోర్, ఎక్ సోటిక్ టిక్, బల్బ్, సీడ్, సీడ్ లింక్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్ ,ఫ్లవర్స్, నర్సరీ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. నెక్లెస్‌రోడ్‌లో ఈనెల 26నుంచి 30 వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు అందుబాటులో ఉంటాయని మేళాను మంత్రులు ప్రారంభిస్తారని ఖాలీద్ అహ్మద్ వివరించారు.

## దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారామ్‌కు రాష్ట్రపతి పోలీస్ పథకం



తార్నాక, జనవరి 25 ప్రభాతవార్త: విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పోలీస్ పథకాన్ని దక్షిణ మధ్యరైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ సెక్యూరిటీ కమీషనర్ రాజారామ్‌ను వరించింది. రాజారామ్ ఇండియన్ రైల్వే ప్రోటెక్షన్ ఫోర్స్ సర్వీస్‌లో 1989 బ్యాచ్‌కి చెందిన వారు. రాజారామ్ తన వృత్తిలో విస్తృతమైన వ్యూహాత్మక ప్రణాళిక అమలు పరుచుతూ తీసుకువచ్చిన పలు విధానల వల్ల సుమారు రూ. 20 కోట్ల విలువైన బొగ్గు దొంగతనం కాకుండా కాపాడారు. ద్రామా.. భద్రత్ లైన్‌లో తీవ్రవాద ప్రాబల్యం ఉన్న అస్సాం దిమాపూర్ భూబాగంలో కిడ్నాప్‌కు గురైన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడిఈఎన్) దిమాపూర్‌ను, ఉమ్మడి కూంబింగ్ ఆపరేషన్ ద్వార రక్షించారు. రైల్వే భద్రత రంగంలో ఆయన చేసిన కృషికి 2012లో ఇండియన్ పోలీస్ మెడల్, 2006లోడైరెక్టర్ పథకం, డైరెక్టర్ జనరల్ చిహ్నం, 5జీఎం పతకాలు, సెక్యూరిటీ ఎఫిషియెన్సి షీల్డ్, డిజిఆర్‌పిఎఫ్ నుంచి క్రైం మాన్యువల్ 2019ను రూపొందించడంలో రాజారామ్ కీలకపాత్ర పోషించారు. మిలిటెంట్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఆయన అనేక సవాళ్లను విజవంతంగా ఎదుర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంతో పాటు స్వీయ పర్యవేక్షణ ప్రయాణికుల, రైల్వే ఆస్తుల నేరాలు, ఇ..టికెటింగ్, ట్రాబ్యాండ్, మానవ అక్రమ రవాణా వంటి నేరాలను నియంత్రించడంలో రాణించారు. రైల్వే శాఖ మంత్రిచే యూనిఫాం యొక్క కొత్త నమూనాను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం అరుణ్‌కుమార్ జైన్ రాజారామ్‌ను అభినందించారు. రాజారాం నాయకత్వంలో అంకితం భావంతో చేసిన సేవకు దక్షిణ మధ్యరైల్వే అద్భుతమైన విజయాలు సాధించిందని కొనియాడారు.

### కంటోన్మెంట్ విలీనానికి కేంద్ర, రాష్ట్రాలకు ఉత్తరాల ద్వార మద్దతు : వికాస్ మంచ్

కంటోన్మెంట్, జనవరి 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని సివిల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి సంక్షేమ సంఘాలు ఉత్తరాల ద్వార కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలకు మద్దతు తెలుపాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సుంక రవీందర్ కోరారు. ప్రభు త్వాలు చేస్తున్న కసరత్తుపై ప్రజలందరు ఐక్యంగా ఉండి మద్దతు పలుకాలని ఆయన కోరారు. సోషల్ మీడియా, రాచ కొండ గలం ద్వార ప్రజలందరిని చైతన్య పరచడంలో సంక్షే మ సంఘాలు పెద్దఎత్తున మద్దతు తెలుపాలని విజ్ఞప్తి చేశారు.

## నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి



**కంటోన్మెంట్ ప్రజల సమస్యల పరిష్కారానికి సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీగణేష్**

కంటోన్మెంట్, జనవరి 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రక్షణ శాఖ, ఏయిర్‌పోర్ట్ అథారిటీ ఏ-1 ల్యాండ్ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిరుపేదల ఇండ్లకు యాజమాన్యపు హక్కు కల్పించాలని కంటోన్మెంట్‌కు చెందిన ప్రజా నాయకుడు ఎన్.శ్రీగణేష్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్‌ను జిహెచ్‌ఎంసి లో విలీన అంశంపై 8 మెన్ కమీషన్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే రక్షణ శాఖ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఉత్తరయ్య బస్తీ, మట్‌పోర్ట్, నందమూరి నగర్ వంటి బస్తీ వాసులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని ఉచితంగా క్రమబద్దీకరణ చేసి వారికి ఇండ్ల పట్టాలు అందజేసి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, అదే విధంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న ఈ అంశంపై అసెంబ్లీలో ప్రస్తావించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వీరికి ఇండ్ల పట్టాలు వచ్చే విధంగా చర్యలు తీసుకునేందుకు ముఖ్య మంత్రి కేసిఆర్, కేటిఆర్‌ల దృష్టికి తీసుకు తేవాలన్నారు.

## లోకేష్ పాదయాత్రకు ప్రభుత్వం సహాకరించాలి

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**



**టీడీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న పి.సాయిబాబా**

ధర్నాచౌక్, జనవరి 25, ప్రభాతవార్త: నారా లోకేష్ పాదయాత్రను అడ్డుకోవాలనే వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మానుకుని, సహకరించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. రిపబ్లిక్‌డే నాడు నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభిస్తున్న సందర్భంగా బుధవారం ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన అనంతరం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జిల్లా కార్యాల యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సాయిబాబా మాట్లాడుతూ యువగళం ప్రజల్లోకి వెళ్లకుండా వైసీపీ నాయకులు విశ్వప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో జగన్ పాదయాత్ర చేపట్టినప్పుడు తెలుగుదేశం అధికారంలో ఉన్నా ఏనాడూ అడ్డుకునే ప్రయత్నం చేయలేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు జీవో నెంబర్ 1 పేరుతో చంద్రబాబు నాయుడు పాదయాత్రను, లోకేష్ బాబు పాదయాత్రను అడ్డుకోవటం వారి నిరంకుశ పాలనకు నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్య దర్శి పి.బాలరాజ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి పాల్గొన్నారు.

## పంచ సహస్రావధాని డా. మేడసాని మోహన్‌కు వంశీ కనకాభిషేకం

రవీంద్రభారతి, జనవరి 25 ప్రభాతవార్త : అపూర్వ పంచ సహస్రావదాన సార్వభౌమ డా. మేడసాని మోహన్‌కు వంశీ సంస్థల స్వర్ణోత్స వాన్ని పురస్కరించుకొని వంశీ ఇంటర్నేషనల్, శుభోదయం గ్రూప్ సంయుక్త నిర్వహణలో కనకాభిషేకంతో సత్కరించనున్నట్లు శిరోమణి వంశీ రామరాజు తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన ఈ నెల 27న రవీంద్రభారతి ప్రధాన వేదికపై నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, కేంద్ర మాజీమంత్రి డా. టి.సుబ్బరామిరెడ్డి, శాంతబయోటెక్నిక్స్ అధినేత డా. వరప్రసాదరెడ్డి, శుభోదయం లక్ష్మీవరప్రసాద్, ప్రముఖకవి డా. ఎం.కె.రాము అతిథులుగా హాజరవు తారని ఆయన వివరించారు.

# డెక్కన్ భవనం కూల్చివేతకు ఏర్పాట్లు



కంటోన్మెంట్, జనవరి 25 ప్రభాతవార్త: సనత్ నగర్ నియోజకవర్గం సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట్ డివిజన్ మినిస్టర్ రోడ్డు ప్రధాన రోడ్డు మార్గంలో అగ్నిప్రమాదానికి గురైన డెక్కన్ కార్పోరేట్ భవనం కూల్చివేతకు జిహెచ్‌ఎంసి యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. అధునాతన యంత్రాలతో భవనం కూల్చివేసేందుకు సంబంధిత కాంట్రాక్ట్, ఏజెన్సీలను, టెండర్ సోటిఫికేషన్ జారీ చేయగా బుధవారం కొందరు కాంట్రాక్ట్ ఏజెన్సీలు పాల్గొన్నారు. అగ్ని ప్రమాదానికి గురైన భవనాన్ని కూల్చివేయుటకు అవసరమైన యంత్ర సామాగ్రి తెచ్చుకోవాలని అధికారులు తెలిపారు. కూల్చివేతకు సంబంధించి పోలీసు, రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారుల నుంచి క్లేరెన్స్ తీసుకోవాలని సూచించారు. ఆర్‌సిసి స్లాబ్‌లు, బీమ్స్, కాలమ్స్, మిషనరీ, వాల్వ్‌లు, తలుపులు, షెట్టర్లు, ర్యాక్స్, కిటికీలు, వెంటిలేటర్లతో పాటు మొత్తం భవనాన్ని కూల్చాలని టెంబర్ నిబంధనలో పేర్కొన్నారు. పోలీస్, అగ్ని మాపక, ఈవిడిఎం అధికారుల సమన్వయంతో భవనాన్ని కూల్చాలన్నారు. కూల్చివేతకు అవసరమైన యంత్ర సామాగ్రితో పాటు సేఫ్టీ ఏర్పాట్ల బాధ్యత కాంట్రాక్టర్లకే ఉంటుందన్నారు. భవనాన్ని కూల్చివేసే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే కాంట్రాక్ట్ నిబంధనల మేరకు నష్టపరిహారాన్ని ఏజెన్సీ బాధ్యత వహించాల్సి ఉంటుందని నిబంధనలో పేర్కొన్నారు. భవనాన్ని నిబంధనల మేరకు కూల్చాలన్నారు. భవనం చుట్టుప్రక్కల ఉన్న నివాసాలకు, ప్రజలకు నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. భవనాన్ని కూల్చివేసే సమయంలో దుమ్ము, శబ్దాలు తలెత్తకుండా బారీ కేడింగ్‌తో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కూల్చివేసే భవనానికి విద్యుత్, మంచినీరు,శానిటరీ కనెక్షన్లను తొలగించాలన్నారు. కూల్చివేతలతో పాల్గొనే సిబ్బందికి రక్షణ పరికరాల బాధ్యత కాంట్రాక్టర్లకే ఉండాలని సూచించారు. కూల్చివేసిన ఇటుకపెల్లలు, డెబ్రిస్‌ను ఏజెన్సీ, కాంట్రాక్టర్లు తరలించాలన్నారు. అగ్నిప్రమాదంలో అసువులు భాసిన ముగ్గురు మృతదేహాలకు సంబంధించిన అవిశేషాలను, భవనం కూల్చివేత, శిథిలాల తొలగింపు సమయంలో వెతకాలని పోలీసులు నిర్ణయించారు.

## మంచినీటిపైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



**శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

హైదరాబాద్, జనవరి 25,ప్రభాతవార్త: కాచిగూడ డివిజన్, జమాల్‌బస్తీలో 10లక్షల నిధులతో వేయనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శంకుస్థాపన చేశారు. అనంతరం కాలేరు మాట్లాడుతూ సకాలంలో పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే జమాల్ బస్తీలో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్, దిడ్డి రాంబాబు, వాటర్ వర్క్స్ డిజిఎం సన్యాసిరావు, ఏఈ భావన, జిహెచ్‌ఎంసి ఏఈ దివ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

### 108 బజార్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

కంటోన్మెంట్,జనవరి 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డు 108 బజార్‌లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే సాయన్న, కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌ల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా తనవంతు కృషి చేస్తానని సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్‌గుప్త తెలిపారు. బుధవారం ఆయన 108 బజార్‌లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణ్, లక్ష్మణ్, లారెన్స్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## రసరంజని సందేశాత్మక పౌరాణిక నాటకం గుణనిధి

**డా. కె.వి.రమణాచారి**



రవీంద్రభారతి, జనవరి 25 ప్రభాతవార్త : ప్రతీ నెలా నాటకం-ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనం దం... అదే మాబాట, మామాట నినాదంతో ప్రతీనెలా నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్న రంగస్థల రంగాన్ని విశేషంగా ప్రోత్స హిస్తున్న రసరంజని సంస్థ ఆధ్వర్యంలో సిఎస్ఆర్. కళామందిరం నాగోలు, హైదరాబాద్ వారి సమర్పణలో ప్రదర్శింపబడిన గుణనిధి పౌరాణిక నాటకం ప్రతిఒక్కరికీ అన్వయించే సందేశాత్మకంగా ఉందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి తెలిపారు. రాజనాల సత్య పర్యవేక్షణలో శ్రీనాథ కవిసార్వ భౌముని కాశీఖండం మూలకథగా, డా. కొట్టే వెంకటాచార్యులు దర్శకత్వంలో రూపొందిన ఈ నాటకాన్ని బుధవారం రాత్రి 6గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రదర్శించారు. రాజపురోహితుడైన యజ్ఞదత్తుడు అనే సోమయాజికి లేకలేక పుట్టిన సంతానం గుణనిధిని తల్లి ఎంతో గారాబంగా పెంచుతూ అక్షరా భ్యాసం తర్వాత గురుకులం వెళ్లినవాడు తర్వాత చెడుస్నేహాలు పెంపొందిం చుకుని చదువు అశ్రద్ధ చేసినా విషయం తెలిసి కూడా తండ్రి సోమయాజులకు తెలియకుండా జాగ్రత్తపడుతూ కాలంగడిచేకొద్దీ గుణనిధికి వివాహం జరుగడం, దుర్వశనాలకు లొంగి పోయి ఆఖరికి బికారిగా మారి, ఆఖరికి ఆకలిని తీర్చుకోదానికి దొంగతనానికి పాల్పడగా రాజభటులు బాణాలతో గుణనిధిని చంపుతారు. బాల్యంలో తల్లిదం డ్రులు పిల్లల్ని నిర్లక్ష్యం చేస్తే జరిగే పరిణామాలను కళ్లకుకడుతూ సందేశాత్మకంగా సాగిన ఈ నాటకంలో ప్రధాన పాత్రల్లో వెంకటసాయిచందు, సూర్యప్రకాష్, కృష్ణ, డా. కొట్టే వెంకటాచార్యులు, జి.మనుప్రియ, సావిత్రి అద్భుతంగా నటించారు.

## తెలంగాణ మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నాంపల్లి, జనవరి 25 ప్రభాతవార్త : హిమాయత్‌నగర్, సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభల ప్రతినిధుల సభలో బుధవారం యూనియన్ నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘ గౌరవాధ్యక్షుడు మహ్మద్ యూసఫ్ ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడుగా మహ్మద్ యూసఫ్, అధ్యక్షుడుగా సత్యనారాయణరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా వి.వేణుకుమార్, ఉపాధ్యక్షులుగా ఎంసిఎస్.రాజు, కె.గంగాధర్, ఎం.యాదయ్య, ఎస్.శివానందం, వి.కరుణాకర్, ఆర్.సరితా, వీరేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పి.ఇందిరా శ్రీలక్ష్మి, ఉప ప్రధాన కార్యదర్శులుగా కె.శ్రీనివాసచారి, పి.నరసయ్య, కార్యదర్శులుగా నిమ్మ శ్రీనివాస్, ఎం. మధుసూదన్‌రెడ్డి, బి.సరస్వతి, అమృత్‌రావు, బి.వెంకటేశ్వర్లు, ఎండి. రఫీఖ్, జగన్ మోహన్, కోశాధికారిగా శాంత్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూసఫ్ మాట్లాడుతూ కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంఘటిత రంగ కార్మికులతోపాటు అసంఘటిత రంగ కార్మికులను కూడా ఏకంచేసి బలమైన ఉద్యమాలు నిర్మించి తమ హక్కులను సాధించుకుంటామని తెలిపారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో గత 6దశాబ్దాలుగా ప్రభుత్వ గుర్తింపు సంఘంగా కొనసాగుతున్న సంఘం ఏఐటియుసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమేనని గుర్తుచేశారు. అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషిచేసిందని, హక్కులు సాధించిపెట్టిందని పేర్కొన్నారు. పి.ఇందిరా శ్రీలక్ష్మి యూనియన్ చరిత్రలో మొదటిసారిగా మహిళనైన నన్ను ఎన్నుకోవడం ఆనందంగా ఉందని, వైద్య విధాన పరిషత్‌తోపాటు రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ ఆస్పత్రులలో ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో సతమతమౌతున్నారని, కాంట్రాక్టు మెడికల్ సిబ్బంది శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తపరుస్తూ ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ క్రియాశీలక పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు.

# ఆదివాసులపై వైమానిక దాడులు.. నిర్భంధాలను ఆపేయాలి

**హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరామ్**



**ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్**

చిక్కడపల్లి, జనవరి 25 ప్రభాతవార్త: దండకారణ్య ఆదివాసులపై వైమానిక దాడులు భారత రాజకీయాలపై తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని మేధావులు, ప్రజాసంఘాల నేతలు వ్యాఖ్యానించారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బుద్ధిజీవులు, ప్రజాస్వామికవాదులు (తెలంగాణ) ఆధ్వర్యంలో దండకారణ్య ఆదివాసులపై వైమానిక దాడులు రాజ్యాంగ వ్యతిరేకం-ప్రజలపై భారత ప్రభుత్వం చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్, ప్రముఖ సాహితీవేత్త కె.శివారెడ్డి, ప్రొఫెసర్ పిఎల్.విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ కల్పనా కన్నబిరన్, ఎకె.ప్రభాకర్, సజయ, హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రతినిధి జీవన్‌కుమార్, అంబటి నాగయ్య,పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ఎస్ఎ.డేవిడ్, న్యూడెమోక్రసీ నేత సాధినేని వెంకటేశ్వర్లు, అరుణోదయ విమలక్క, సిఎంఎస్ నుంచి జ్యోతి, సిఆర్‌పిపి నుంచి బల్లరవి, రవిచంద్ర, పిడిఎం నుంచి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులపై వైమానిక దాడులలతో సహా అన్ని రకాల నిర్భంధాలను ఆపేయాలని డిమాండ్‌చేశారు. ఈ ధోరణి ఇంకా తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని, గతంలో ఇలాంటి ప్రభుత్వ చర్యలను పౌరసమాజం తీవ్రంగా నిరసించిందని, పాలకులపై వత్తిడి తెచ్చిందని, పాలకులపై ఒత్తిడి తెచ్చిందని అన్నారు. ఆ పని గతంకంటే మరింత ఉమ్మడిగా చేపట్టాల్సిన అవసరం ఉందని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా కృషి చేయడంలో వీరంతా ముందుకు వస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని అన్నారు.




## ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తున్న కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, జనవరి 25 ప్రభాతవార్త : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం మన భారతదేశం, ఇలాంటి దేశంలో పట్టణాల్లో నివసించే కొందరు ప్రజలు ఓటు వేయడానికి ముందుకు రావడంలేదని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ అన్నారు. సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమే మాట్లాడుతూ యువత ఓటు హక్కును వినియోగించుకోడానికి ముందుకు రాకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రారంభించిందని తెలిపారు. ప్రజలు తమ ఓటుహక్కు ద్వారా తమకు కావాల్సిన ప్రతినిధిని, ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఉపయోగించే అస్త్రమని, ఓటుహక్కును ఖచ్చితంగా వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : కొంతం దీపిక



రెజిమెంటల్ బజార్ మనోహార్ థియేటర్ వద్ద అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

అడ్డగుట్ట, జనవరి 25 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక సూచించారు. బుధవారం మనోహార్ థియేటర్ వద్ద కొనసాగుతున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు హాకీం, రవిందర్, బిజెపి నేతలు కొంతం నరేశ్, వీరవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ సెక్రెటరీ శాంతకుమారిని కలిసిన డిప్యూటీ మేయర్



చీఫ్ సెక్రటరీ శాంతకుమారికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, తలసాని, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, జనవరి 25 ప్రభాతవార్త: ఇటీవల పదవీభాధ్యతలు స్వీకరించిన తెలగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతకుమారిని మంత్రులు మహమూద్ అలీ, తలసాని, నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సీఎస్‌కు పుష్ప గుచ్ఛాన్ని అందించి అభినందలు తెలిపారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి

### కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్స్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

చార్మినార్, జనవరి 25 ప్రభాతవార్త : విద్యార్థులు కష్టపడి చదివితే ఆశించిన రంగాలలో తప్పకుండ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన తన సొంత నిధులతో ఎగ్జామ్ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమ శిక్షణ, పట్టుదలతో చదివి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, రామకృష్ణ, జనార్దన్, టి.సుధాక ర్‌రెడ్డి, రావుల భాస్క ర్, ఎల్‌వి రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లి ఖార్జున్, అవి నాష్, కుమార్, సంతు, భాను ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఓటు హక్కు ఎంతో ముఖ్యమైంది : ఉజ్వల్**

అడ్డగుట్ట, జనవరి 25 ప్రభాతవార్త: ప్రజా స్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైందని మారేడ్‌పల్లి ప్రభుత్వ జూని యర్ కళాశాల లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్వల్ తెలిపారు. జాతీయ ఓటర్ల దినో త్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మారేడ్‌పల్లి లోని ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఓటరు ప్రముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

## కెసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శం : ఎమ్మెల్యే సాయన్న



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయన్న

కంటోన్మెంట్, జనవరి 25 ప్రభాతవార్త: తెలంగాణలో ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలౌతున్నాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. బుధవారం కార్ఖానలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 66 మంది లబ్ధిదారుకు మంజూరైన కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల వివాహానికి వారి తల్లిదండ్రులకు భారం పడకుండా ముఖ్యమంత్రి కేసిఆర్ అన్ని వర్గాల వారికి కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా ఆసరా పింఛన్లు, రైతుబంధు, దళితబంధు వంటి పథకాలు దేశంలో ఎక్కడాలేని విధంగా అమలౌతున్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌లు శైలజా (సికింద్రాబాద్), (హసినా) తిరుమలగిరి, డిసి శివకుమార్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మాజీ కో-అప్షన్ సభ్యుడు నర్సింహ్మా ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు సదానంద్‌గౌడ్, తేజ్‌పాల్, సంతోష్ యాదవ్, నివేదిత, నాగినేని సరిత, నిత్యానంద్, స్రుజన్ ముదిరాజ్, పెంట శ్రీహరి, కిరణ్ కుమార్, మురళీ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రాజకీయ నాయకుల తలరాతను మార్చే ఆయుధమే ఓటు

### తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి



ప్రమాణం చేస్తున్న న్యాయవాదులు

ధర్నాచౌక్, జనవరి 25, ప్రభాతవార్త: మన భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, రాజకీయ నాయకుల తలరాతను మార్చే ఆయుధమే ఓటు అని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం జాతీయ ఓటర్స్ దినోత్సవ సందర్భంగా న్యాయవాదులు సమిష్టిగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు ఒక వజ్రం లాంటిదని, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరికీ సమానమైన విలువను ఓటు కల్గిస్తుందని పేర్కొన్నారు. దేశంలోని పౌరులు వివేకంతో, విజ్ఞతతో, బాధ్యతాయుతంగా ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మనల్ని పాలించేది మనం వేసే ఓటు అనే విషయం ప్రతి ఒక్క ఓటరు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. చదువుకున్న విజ్ఞానవంతులు ప్రభుత్వాలపై విమర్శలు గుప్పిస్తూ ఉంటారు కానీ, ఎన్నికల సమయంలో ఓటు వేసే టప్పుడు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉంటారని, ఇది ప్రజా స్వామ్యానికి ఆటంకమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఏ.అనంతసేనారెడ్డి, వి.రవికుమార్, రామకృష్ణ, పి.ప్రదీప్, ఎన్.నరేష్, బాల్‌రెడ్డి, రఘు, వి.టి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు కొట్టివేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి, జనవరి 25 ప్రభాతవార్త: కొమ్మల కత్తరింపు పేరుతో చెట్లను నరికివేస్తున్న అర్బన్ ఫారెస్ట్, విద్యుత్తు శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో కౌన్సిల్ అధ్యక్షుడు సిహెచ్.రంగయ్య, గౌరవ అధ్యక్షుడు ఉప్పల వెంకటేశ్, ప్రకృతి ప్రేమికులు మన్నెదామోదర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. హరితహారం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతుంటే విద్యుత్తు వైర్లకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో చెట్లను నరికివేస్తూ పచ్చదనాన్ని హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని అన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అర్బన్ ఫారెస్ట్ అధికారులు, చెట్లు కొట్టివేస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఓటర్ లిస్టులో పేరును నమోదు చేయించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేటర్ కమిటి సభ్యలు రాజేష్ కుమార్

చార్మినార్, జనవరి 25 ప్రభాతవార్త : ప్రతీ ఒక్కరూ ఓటర్ లిస్ట్‌లో తమ పేరును నమోదు చేయించు కోవాలని టిపిసిసి ఎన్నికల కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటి సభ్యులు పులిపాటి రాజేష్ కుమార్ (రాహు ల్) అన్నారు. బహదూర్‌పుర నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేటర్ కమిటి సభ్యలు రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమం జరిగింది. దూద్‌బౌలి బొందలగూడలోని జూపిటర్ మిషన్ హై స్కూల్‌లో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్ర మంలో రాజేష్‌కుమా ర్ పదో తరగతి విద్యార్థులు, స్థాని కులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మాజీ ప్రధానమంత్రి స్వర్గీ య రాజీవ్‌గాంధీ 18 సంవ త్సరాలు వయస్సునిండిన యువ తకు ఓటు హక్కును కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిహెచ్ఎంసి సూపర్ వైజర్ గంటి రమేష్, బిఎల్‌లు మధుర, నీలావతి, మనీషాలు పాల్గొన్నారు.

## కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి: శ్రీనివాస్‌రెడ్డి

చిక్కడపల్లి, జనవరి 25 ప్రభాతవార్త: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు కంటి జబ్బుల నుంచి ఉపశమనం కలిగిస్తుందని టిఆర్ఎస్ రాష్ట్ర నేత, విఎస్టీ వర్కర్స్ యూనియన్‌అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కంటి వెలుగు కార్యక్రమం కింద బాగ్‌లింగంపల్లిలోని నైబర్‌హుడ్ కమ్యునిటీ హాల్‌లో జరుగుతున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నైబర్‌హుడ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు సిరిగిరి కిరణ్, బిఆర్ఎస్ సీనియర్ నేతలు సిరిగిరి శ్యామ్, కార్తీక్‌యాదవ్, సత్యనారాయణ, సిద్దిక్, సాయియాదవ్, రాజేశ్, వెంకటేశ్, కల్పన, రేఖ, రవియా దవ్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భక్తరామదాసు జయంతి ఉత్సవాలు



జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న చైర్మన్ వకుళాభరణం, బూర వెంకటేశం, శ్రీనివాస్‌రావు తదితరులు

హైదరాబాద్, జనవరి 25,ప్రభాతవార్త: హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం రామదాసు 390వ జయంతి ఉత్సవాలు బుధవారం ట్యాంక్ బండ్‌పై ఉన్న భక్తరామదాసు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. దీనికి బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, బిసి సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బూరవెంకటేష్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై రామదాసు విగ్రహాన్ని పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు మారగాని శ్రీనివాసరావు అధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలను నిర్వహించి టిటిడి వారి చేత కచేరి నిర్వహించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్యాంసురాలు డాక్టర్ రమాప్రభ ఆధ్వర్యంలోని వారి శిష్యబృందం చేత నవరత్న కీర్తలను కన్నుల పం డుగగా నిర్వహించారు. ఈసందర్భంగా బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ 12ఏళ్ల జైలుజీవితం గడిపిన భక్తరామదాసు, 300లకుపైగా కీర్తనలు రచించి గానం చేశారన్నారు. బిసి సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం మాట్లడుతూ భక్తరామదాసు జయంతి ఉత్సవాలను ప్రతిజిల్లాలో జరిపేలా బాషా సాంస్కృతికశాఖ చొరవ తీసుకోవాలని సూచించారు. నేటి యువత భక్తరామదాసు చిత్తశుద్దిని నిజాయితీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మారగాని శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గత మూడేళ్ల గా భక్తరామదాసు జయంతి ఉత్సవాలను ట్యాంకుబండ్‌పై ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తరామదాసు కీర్తనలకు బహుళ ప్రాచుర్యం కల్పించేందుకు శ్రీహరిహర ఫౌండేషన్ కృషి చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షతన వహించగా నాయకులు భవానీ శంకర్, ఎం.వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ కె రామదాసు, కంచకచర్ల వెంకటరమణ, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

## మీ సమస్య మా పోరాటం ద్వారా పరిష్కారం

**బిజెపి నేత గజ్జల యోగానంద్**



స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలిస్తున్న యోగానంద్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 25, ప్రభాతవార్త : మీ సమస్య మా పోరాటం ద్వారా డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని శేరిలింగంపల్లి బిజెపి ఇంచార్జీ గజ్జల యోగానంద్ పేర్కొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ హనుమాన్ నగర్‌లో గజ్జల యోగానంద్ బిజెపి పార్టీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం అక్కడి నుండి హనుమాన్ నగర్, మహాత్మాగాంధీ నగర్, ఖాజానగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం పర్యటించారు. ఎక్కడికి వెళ్ళినా డ్రైనేజి సమస్య, నీటి సమస్య, రోడ్ల సమస్య అని, ఎక్కడికక్కడ కాలువల్లో చెత్త నిలువ ఉంటుందని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలు ఇన్ని సమస్యలను ఎదుర్కొంటున్నా పట్టించుకోకపోవడం కెసిఆర్ ప్రభుత్వం, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నిర్లక్ష్యమని అన్నారు. ప్రజా సమస్యలు కనపడవు, వినపడవు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి బిజెపి పార్టీ తలపెట్టిన మీ సమస్య మా పోరాటం ద్వారా ఈ సమస్యలపై పోరాడి త్వరలోనే వీటికి విముక్తి కల్పిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురభి రవీందర్, కమలాకర్, జానకిరామ్‌రాజు, విజిత్‌వర్మ, వి.శ్రీనివాస్, శ్రవంతి, రామకృష్ణ, రఘు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

### మాధవరం కాంతారావు



సమావేశంలో పాల్గొన్న మాధవరం కాంతారావు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 25, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధి కారంలోకి తీసుకురా వడమే లక్ష్యంగా టి బిజెపి కృషి చేస్తుందని, బిజెపి అధిష్టానం సైతం తెలంగాణపై మరింత ఫోకస్ పెంచిందని కూకట్‌పల్లి నియో జకవర్గం బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు పేర్కొన్నారు. బుధవారం కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని మూ సాపేట డివిజన్‌లో బిజెపి పోలింగ్ బూత్ అధ్యక్షుల భేటి నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు హాజరై బూత్ అధ్యక్షుల కమిటీలు, అనుసరించాల్సిన విధివిధానాలను ఆయన వివరించారు. అనంతరం మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హరీశ్‌రెడ్డి, సీనియర్‌నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట బిజెపి కార్పొరేటర్ మహేందర్ పలువురు నేతలతో కలిసి పోలింగ్ బూత్ అధ్యక్షుడి పేరుతో ప్రత్యేకంగా తయారు చేయించిన బోర్డును పోలింగ్ బూత్ అధ్యక్షుల ఇంటికి అతికించి వారికి తగు గౌరవాన్ని అందిస్తూ ఎన్నికల వేళ పోలింగ్ బూత్ అధ్యక్షుల ప్రాసస్త్యాన్ని ఈ సందర్భంగా కాంతారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, వినోద్‌కుమార్, శైలేష్‌కుమార్, దక్కయ్య, కృష్ణముదిరాజ్, మల్లేష్, మాణిక్, యాదగిరి, మంగమ్మ, సతీష్, సాయి, శ్రీను, కిషోర్, అబ్బాస్, రవిగౌడ్ పాల్గొన్నారు.

## చీఫ్ వార్డెన్‌గా ప్రొ. కొర్రెముల శ్రీనివాస్ మరో సంవత్సర కాలం పొడగింపు



ప్రొ.కొర్రెముల శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న టీఆర్ఎస్వీ నాయకులు సురేష్

తార్నాక, జనవరి 25 ప్రభాత వార్త: ఓ.యూ చీఫ్ వార్డెన్‌గా ప్రొ. కొర్రెముల శ్రీనివాస్‌ను మరో సంవత్సర కాలం పాటు పొడగించడంతో పలువురు విద్యార్థి నేతలు ఆయనకు అభినం దనలు తెలిపారు. బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఓ.యు యూ అధ్యక్షుడు బొర్రెల్లి సురేష్, టీఆర్ఎస్వీ ఓ.యూ ప్రధాన కార్యదర్శి నల్లా మిథున్ ప్రసాద్ తధితరులు డా. కొర్రెముల శ్రీనివాస్‌ను కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పఠాన్ సినిమా నిషేదించాలి



పఠాన్ సినిమా నిషేదించాలని చేయాలని నిరసన చేస్తున్న భజరంగ్‌సేనా ప్రతినిధులు శివప్రసాద్, లక్ష్మన్‌రావుగుప్త

బేగంబజార్, జనవరి 25 ప్రభాతవార్త: తెలంగాణ భజరంగ్ సేనా ఆద్వర్యంలో కాచిగూడ చౌరస్తా వీరసావర్క్ విగ్రహం వద్ద పఠాన్ సినిమా నిషేదించాలని చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున్న నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు శివ ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్ రావు గుప్త మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా పఠాన్ సినిమా ఉందన్నారు. ఫీల్మ్‌సెన్సార్‌బోర్డు పూర్తిగా నిషేదించాలని డిమాండ్ చేశారు. సినిమా థియేటర్ల యాజమానులు కూడా సినిమా నిలిపివేయాలని హెచ్చరించారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ప్రతినిధులు సూర్యశుక్లా, శ్రీరామోజ్, రంజనీ, శ్రీనివాస్‌గుప్త, మహేష్ కుమార్, ప్రవీణ్‌దూబే, మహేందర్, సుదర్శన్ తివారి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్

పురానాపూల్, జనవరి 25ప్రభాతవార్త: పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు సహకారంతో పురానాపూల్ డివిజన్‌ల్లో కులమతాలకు అతీతకంగా అభివృద్ది పనులను చేపట్టడం జరుగుతుందని పురానా పూల్ డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ తెలిపారు. డివిజన్ పరిధిలో దూద్‌బౌలి నుంచి చిన్న బజార్, కబుతర్‌ఖానా, ఎస్.వి.నగర్ తదితర ప్రాంతాల్లో నూతన బిటిరోడ్లు, చేపట్టినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో అధికారులు, మజ్లీస్ నాయకులు శ్రీనివాస్, ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.



సెల్ఫ్ డిఫెన్స్ ఫర్ గర్ల్స్ కార్యక్రమంలో పాల్గొన్న మహాలక్ష్మి రామన్‌గౌడ్ తదితర నాయకులు


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన

నిట్ నెం.45/EE-Div-29/SBZ/GHMC/2022-23, తేది: 24.01.2023. క్ర.సం.1, పని పేరు: సికింద్రాబాద్, GHMC, డివిజన్-29, వార్డ్-143, తార్నాక, లాలాపేట వద్ద సత్య నగర్ కమ్యూనిటీ హాల్‌కు మిగిలిన పనులు, ప్రహారీగోడ నిర్మాణం, స్లేజ్, ఫ్లోరింగ్ మరియు ప్లంబింగ్ పనులు మొ॥నవి. అంచనా మొత్తం లక్షలలో: 30.00, మొత్తం: 30.00. వివరాలు: ప్రారంభ తేది: క్ర.సం. నం.1 వద్ద పనుల కొరకు: 25.01.2023 సా॥4.00 గం. ప్రైస్ బిడ్ తెరుచుట: పై పని కొరకు: 31.01.2023 @ సా॥4.00 గం. సంబంధిత అధికారి చిరునామా: శ్రీమతి డి. ఆశాలత, EE, Div-29, GHMC. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, Div-29, సికింద్రాబాద్, GHMC
DIPR.No.11830-PP/CL/Advt/1/2022-23, తేది: 25.01.2023



వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, GAMAR, R/o.10-1-486, CHINTAL BASTI, KHAIRATABAD, HYD, T.S, Changed My Name As GAMAR KHALED W/o.ABDUL RAHMAN BIN MOHAMMED.

★ I, ASFIA UNNISA BEGUM, R/o. 19-2-75/6, BASHARATH NAGAR, JAHANUMA, HYD, T.S, Changed My Name As ASIF UNNISA W/o. MOHAMMED AKBAR.

★ I, ABDUL HAQ, R/o.18-1-350/11/67, Gulshan Iqbal Cly, HYD, T.S, Changed My Name As MOHAMMED ABDUL HAQ SIDDIQUI S/o.MOHAMMED ABDUL LATEEF SIDDIQUI.

★ I, MOHAMMED ABDUL HAQ SIDDIQUI, R/o.18-1-350/11/67, Gulshan Iqbal Cly, HYD, T.S, Changed My Child Name From ABDUL LATEEF SIDDIQUI to MOHAMMED ABDUL LATEEF SIDDIQUI.

★ I, MUNAGALA PADMA, W/o. Late Madhusudan Rao, R/o. H.No.1-5-858 (Old No.5-28/2) Maruthi Nagar, Kothapet, Hyd-60. Changed My Name as VALA MADHAVI.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



IN THE COURT OF THE PRL JUNIOR CIVIL JUDGE, R.R.DIST AT: HAYATHNAGAR
O.S.NO. 911 OF 2022

**Between :**
Siddala Laxmamma, W/o.Late Siddala Anjaiah, aged about 54 years, Occ: House Wife, R/o.H.No.2-29, Koheda Village, Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, T.S. & Other.
...Plaintiffs
AND
1.The Tahsildar Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District.
2. All Concerned.
... Defendants
To,
All Concerned
Know all men by these presents that the plaintffs Siddala Laxmamma & other had filed the above suit against the The Tahsildar Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, and all Concerned for declaring them as legal heirs of deceased Siddala Anjaiah, Vide **O.S.No.911 of 2022 on the file of the Hon'ble Principal Junior Civil Judge, Ranga Reddy District** at **Hayath nagar** and the same is posted to **01-02-2023.** So, all concerned people are hereby informed that if they got any interest or objection regarding the above case, they may appear before above said Hon'ble Court.
**Sd/- SATHYA VEER REDDY, AKKI SHEKAR,**
Advocates
H.No.16-1-30/A/29, Saidabad Colony, Hyderabad-500 059.



IN THE COURT OF HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE CUM VII ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT AT HAYATHNAGAR
O.S. No. 9 of 2023

Between:
**Kollu Venkata Ramana and others**
**...Plaintiffs**
AND
**1) R. Kashyap Kumar**
**2) All concerned ...Defendants**
To,
All Concerned
Please take notice that the Plaintiffs have filed the above SUIT for declaration to declare them as legal heirs of K. Parvathi @ Kollu Parvathi W/o K. Venkataramana, who died on 09-09-2022 in respect of Suit Schedule Property and the same has been posted on 13-02-2023. If any person having any objection or claims in this regard, they may appear on 13-02-2023 at 10:30 AM, either in person or through advocate, Otherwise the matter will be decided basing the documents available on record.
**SCHEDULE PROPERTY**
All that the open plot bearing plot No. 354, admeasuring 200 Sq.Yds in Survey No.144, situated at Gayathrinagar Colony, Ward No.5, Block No. Sahebnagar Kalan Village, Hayathnagar Mandal, Ranga Reddy District, and Bounded by: North: 25' ft wide road, South: Neighbors land, East: Plot No. 353, West: Plot No. 355.
\\ By order of the court \\
**M/s. NALLAGATI RAMBABU,**
**Advocates,**
# 8-2-103/9/4, Plot No.5, Road No.14, Shakthinagar, Chintalkunta, L.B.Nagar, Hyderabad, **Cell : 9949258012**



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-IV ADDL. M.M. MEDCHAL-MALKAJGIRI AT : L.B. NAGAR
O.S. No. 2426 of 2022

Between:
**Smt. Desham Hemalatha and Others ...Plaintiffs**
AND
**1) The MRO,** Ghatkesar Mandal,
**2) All concerned**
**...Defendants**
To,
All Concerned
Sir, Please take notice that the Plaintiffs has filed a suit for Declaration plaintiff's as legal heirs of the deceased Late **Sri Desham Bal Raj Goud** and the same is now stands posted on 09.02.2023 for appearance of all concerned and Written Statement if any. Please make it convenient to present either in person or through Counsel before the above the date Hon'ble Court at **10.30 a.m. on 19.02.2023.** If you fail to appear on the above date the matter will be heard exparte.
//By Order of the Court//
**Sd/- D. Madhava Rao,**
**Advocate**
DMR LAW CHAMBERS
#41 Ishaq Colony, Wellington Road, AOC Center, Secunderabad-15.
**Phone: 994896480.**



IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S. No. 1066 OF 2022

Between:
**Smt. Laxmi Parekar & another**
**...Plaintiffs**
AND
**Smt. Pramila Bai Biradar**
**...Defendants**
To,
**Smt. Pramila Bai Biradar** W/o Late Ramchander, Aged 42 years, Occ: Household, R/o 13-3-859, Mahankali Street, Jiyaguda, Karwan, Hyderabad
Sir,
Please take notice that the above case is filed against you for perpetual Injunction against you and another person, and same is posted to 2-2-2023 for your appearance. If you fail to appear either in person or through your counsel, the matter will be decided in your absence on merit.
//BY ORDER OF THE COURT//
**Sd/- GOPAL RAO PATIL**
**SUNIL KULKARNI**
**Advocates**
Flat No.202, Swagrugha, Sri Laxmi Apts, 2-2-1105/4/2, Tilak Nagar, Hyderabad,
**(M): 9347000298**



IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT, AT: L.B. NAGAR
OS.No. 33 of 2023

Between:
1. **Smt. Tella Pramoda Devi,** W/o Late Tella Satyanarayana
2. **Tella Janaki Rama Rao,** S/o Late Tella Satyanarayana
3. **Tella Rajasekhar,** S/o Late Tella Satyanarayana
4. **Tella Bhujanga Rao,** S/o Late Tella Satyanarayana
5. **Guduru Lakshmi Sailaja,** W/o Sri Gudur Prabhakar Rao, D/o Late Tella Satyanarayana
**...Plaintiffs**
AND
1. **All Concerned**
2. **Tahasildar,** Saroornagar Mandal
**...Defendants**
To
All Concerned
Please take notice in the above case, the above named Plaintiffs have instituted a suit for Declaration of Legal Heirs against you and you are hereby summoned to appear in this court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the above case or who shall be accompanied by some person able to answer all such questions on the **27nd day of FEBUARY, 2023 at 10-30 A.M.** Failing which the case will be heard and determined in your absence.
**KONA SREEPRIYA**
**KONA SRINIVAS**
**ADVOCATES**
Flat No.102, 2nd Floor, Sri Vijaya Sai Towers, Chanakyapuri Chanakyapuri, Safilguda
**Ph.No: 9701991588**

## కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు సరైన బుద్ధి చెబుతారు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

**మర్పల్లి జనవరి 25 ప్రభాతవార్త :**
కేంద్ర రాష్ట్రా ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని వచ్చె ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెపుతారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, అధ్యక్షులు రవీందర్‌లు అన్నారు.పల్లె పల్లెకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా కోటమర్పల్లిలో నార్వహించిన కార్యక్రమంలో మాట్టాడుతూ తెలంగాణ సెంటిమెంటుతో బీఆర్ఎస్ కుటుంబ పాలన కొనసాగిస్తుంటే ఇతర ప్రభుత్వాలను కూల్చడమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న బీజేపికి ప్రజలు సరైన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డయని అన్నారు. రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చారని డిజిల్,పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచి దగా చేస్తుందని అన్నారు. తెలంగాణ ఇచ్చిది కాంగ్రెస్ దేశా అభివృద్ధికి పాటుపడేది కాంగ్రెస్ వచ్చె ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవ్వరు ఆపలేరని వారు దిమా వ్యక్తం చేశారు. వికారాబాద్‌లో తిరిగి కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శీ నర్సింలు జిల్లా మైనార్టీ సెల్ అద్యక్షులు ఖలీమేదీన్ మాట్లాడుతూ... ఆదాయం కోసం గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు ఏర్పాటుచేసి రాష్ట్రాన్ని గుడుంబామయంగా మార్చీందని అన్నారు.రైతు రుణమాఫి, ఉద్యోగాలు, డబుల్ బెడ్‌రుములు,దళితులకు 3ఎకరాలభూమి గాలికి వదిలారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం గ్రామ స్తాయి నుండి ప్రతి కార్యకర్త సైనికులుగా పని చేయాలని వారు కోరారు గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఆబివృద్ధి తప్ప బీఆర్ఎస్ లో జరిగింది ఎమిలేదన్నారు ఈసమావేశంలో నాయకులు శంకరయ్యగౌడ్ సురేశ్ సంజీవరెడ్డి మదుకర్‌రెడ్డి ప్రబాకర్ రఫి రాచన్న నాగేస్ రాములు శేకర్‌గుప్త శ్రీనివాస్‌గుప్త సలీమ్ తాజోదీన్ గోపాల్ అశోక్ సాయికుమార్ ధరంసింగ్ పాల్గోన్నారు

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : చైర్మన్

### -సిసి రోడ్డు పనులకు భూమి పూజ



**నాగారం జనవరి25,ప్రభాతవార్త :**
అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు.మున్సిపాలిటీలో పరిధిలోని 20వ.వార్డు గోపికృష్ణ కాలనీ,రవీంద్ర నగర్‌లో బుధవారం స్థానిక కౌన్సిలర్‌తో కలిసి చైర్మన్ చంద్రారెడ్డి సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ...ప్రజల సౌకర్యం కొరకు రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.రోడ్డు పనులకు సహకరిస్తున్న సందర్భంగా కాలనీవాసులు శాలువాతో ఘనంగా సత్కరించి చైర్మన్ చంద్రారెడ్డికి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండా మల్లేష్ యాదవ్,స్థానిక కౌన్సిలర్ అన్నం రాజు సుమిత్ర సురేష్,అధ్యక్షుడు వెంకటేష్,జంగయ్య,సురేందర్ రెడ్డి,సునీల్,సుబ్రహ్మణ్యం,శ్రీనివాస్ కాలనీ వాసులు,పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : చైర్మన్



పోచారం మున్సిపల్ 3 వ వార్డులో కంటి వెలుగు 2 కార్యక్రమాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేస్తున్న చైర్మన్ కొండల్ రెడ్డితో పాటు కౌన్సిలర్ రాజశేఖర్

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25, ప్రభాతవార్త:**
కంటి సమస్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు 2 ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని 3 వ వార్డులో బుధవారం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని చైర్మన్‌తో పాటు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ చింతల రాజశేఖర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అంధత్వాన్ని నివారించడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును కంటి సమస్యలున్న వారు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి. కొండల్ రెడ్డితో పాటు వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ ఎ. సురేశ్,
వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఏ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

### -బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్

**పెద్దేముల్, జనవరి 25, ప్రభాతవార్త:** అనారోగ్యంతో మృతిచెందిన విఆర్ఏ బాలు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని బిజేపి జిల్లా ప్రధానకార్యదర్శి యు.రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దేముల్ మండల పరిధిలోని గొట్లపల్లి గ్రామానికి చెందిన విఆర్ఏ బాలు అనారోగ్యంతో మృతిచెందారు. బుదవారం నిర్వహించిన బాలు అంత్యక్రియలో బాజాపా నాయకులు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేస్తు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా యు.రమేష్ మాట్లాడుతూ బాలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని అన్నారు. అంత్యక్రియలో ఆర్ఐ రాజీరెడ్డి,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువులకు దాతలు ముందుకు రావాలి

**శంకర్‌పల్లి, జనవరి 25, ప్రభాతవార్త :**
విద్యార్థుల చదువులకు దాతలు ముందుకు రావాలని ప్రధానోపాధ్యాయులు ఏ.విద్యాకర్ తెలిపారు. బుధవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్, పీఎస్‌కొండకల్, పీఎస్ కొండకల్ తాండ పాఠశాలలో సర్పంచ్ లావణ్యకాశీనాథ్‌గౌడ్ విద్యార్థులకు టీషర్ట్, ప్యాంట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ....ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సహాయం కోసం దాతలు ముందుకు రావడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ.... కొండకల్ గ్రామపరిధిలో ఉన్న మూడు పాఠశాలల విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలన్నారు. వారి చదువులకు అవసరమైన నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందిస్తానన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మెన్ ఆశోక్, ఉపాధ్యాయులు రఘునందన్‌రెడ్డి, యాదమ్మ, కుసుమ కుమారిఅంజిరెడ్డి, శ్రీనివాస్, సుజాత, జంగయ్య, రాములు, రాధారెడ్డి, హరికృష్ణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న సర్పంచ్

# పేదకండ్లల్లో వెలుగునింపేందుకే కంటి వెలుగు : మంత్రి మల్లారెడ్డి

### -డబిల్‌పూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి

**మేడ్చల్, జనవరి 25. ప్రభాతవార్త :**
స్వంత కన్నబిడ్డలే చూడని వృద్దులకు, పెద్దవారికి ఇంది పెద్ద కొడుకులా వారి కండ్లల్లో వెలుగు నింపేందుకు గాను కంటి వెలుగు పేరుతో గొప్ప యాగం చేస్తున్న మహోన్నత వ్యక్తి సీఎం కేసీఆర్ అన్ని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. నేటి సమాజంలో వృద్దులకు కనుచూపు మరుగై మసక బారిన జీవితాలతో కొట్టుమిట్టాడుతుండగా స్వంతవారు కూడ వారిని కనికరించికపోయిన వారికి నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ కంటికి వెలుగయ్యాడని ఆయన అన్నారు. మనిషికి అత్యంత అవసరమైన కంటి చూపును కోల్పోకుండా ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేయడంతో కంటి పరీక్షలు ఉచితంగా చేయిస్తున్న సీఎంను రాష్ట్రంలో కొనియాడుతున్నారన్నారు. అదే విదంగా అభివృద్ధిలో కూడ రాష్ట్రాన్ని అత్యున్నత స్థాయిలో నిలిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి, జడ్పిటిసి శైలజ విజయనందరెడ్డి, సర్పంచ్ గీతభాగ్యరెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేష్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్, నాయకులు రాజమల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యారెడ్డి, అశోక్ ముదిరాజ్, గోస్కె అశోక్, ఆరీఫ్, రామోదర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, సురేష్‌రెడ్డి, రణదీప్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీ సంజీవ, శేఖర్, కరుణాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డబిల్‌పూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కల్గి ఉండాలి

### -మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య

### -జిల్లా వ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జనవరి 25, ప్రభాతవార్త**
ప్రజాస్వామ్య భారతదేశంలో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కల్గి ఉండాలని, జిల్లా వ్యాప్తంగ జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకోవటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య సమక్షంలో జిల్లా అధికారులతో, సిబ్బందితో డిఆర్ఓ లింగ్యానాయక్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి తెలియజేసేందుకు 25జనవరి2011నుంచి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధం అని అన్నారు. ఓటర్లుగా నమోదు చేసుకోవటంతో పాటు ఓటింగ్ సమయంలోనూ ఓటు వినియోగించుకోవటానికి యువత ప్రధానంగ ముందుకు రావాలన్నారు. 18సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, సిపిఓ రాంమోహన్, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్అండ్‌బి ఇఇ శ్రీనివాస్‌మూర్తి, కలెక్టరేట్ ఎఒ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటరు దినోత్సవం సందర్భంగ ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య,పాల్గొన్న అధికారులు,సిబ్బంది

# బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రేడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.

**బొంరాస్‌పేట్,జనవరి25,ప్రభాతవార్త :**
బొంరాస్‌పేట్,దుద్యాల్ మండలాల పరిధిలోని రేగడిమైలారం, చిల్‌మూల్‌మైలారం గ్రామాలలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.గతంలో ఎన్నడు జరగని అభివృద్ధి బిఆర్ఎస్ ప్రభుత్వం ద్వార నాలుగేళ్లలోనే చేశామన్నారు.గ్రామాల్లో నూతనంగా సిసి రోడ్లు, త్రాగు నీరు,ప్రజలకుఅవసరమైన మౌళిక వసతులను ప్రభుత్వం కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.చిల్‌మూల్‌మైలారం గ్రామంలో మాజీ కాంగ్రెస్‌పార్టీ సర్పంచ్ మనుమప్పతోపాటుగా 50మంది కాంగ్రెస్,బిజెపి పార్టీ నాయకులు ఎమ్మెల్యే అధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.సత్తార్‌కుంట తాండలో రెండవ విడత కంటి వెలుగు పథకంలో భాగంగా జరుగుతున్న వైద్య పరీక్షలను పరిశీలించి అద్దాలను పంపిణీ చేశారు.బోయినతాండలో నూతన సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన నిర్వహించారు.రేగడిమైలారం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణంకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమీబాయి,వైస్ఎంపిపి సుదర్శన్‌రెడ్డి,పార్టీ అధ్యక్షులు యాదగిరి,చాంద్‌పాష,పిఎసిఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి,రైతుబంధు మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి,మాజీ వైస్ఎంపిపి నారాయణరెడ్డి,యుత్ నాయకులు నరేష్‌గౌడ్,సర్పంచ్‌లు రాజేశ్వరీ,లక్ష్మికాంత్‌రెడ్డి,ఎంపిటీసి జగదీశ్వర్,పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## సిఆర్‌పి ఉద్యోగుల దశాబ్ది మహసభను విజయవంతం చేయాలి

### -సిఆర్‌పిఎ టిఎస్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ గాంగ్యనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సిఆర్‌పిలు

**కుల్కచర్ల, జనవరి25, ప్రభాతవార్త :**
విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగుల దశాబ్ది మహసభను విజయవంతం చేయాలని సిఆర్‌పి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ గాంగ్యనాయక్ అన్నారు. బుదవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం విద్యాశాఖ సమగ్ర శిక్షా అభియాన్ యందు పాఠశాలలో సముదాయపు పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిఆర్‌పి ఉద్యోగులు పది సంవత్సరాలు పూర్తి చసుకున్న సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించతలపెట్టిన దశాబ్ది మహసభను కాంప్లెక్స్ సిఆర్‌పిలు భారి ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కాంప్లెక్స్ సిఆర్‌పి ఉద్యోగులుగా విదులు నిర్వహిస్తూ 10సంవత్సరాలు పూర్తి చేసుకున్న పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదని సర్వశిక్షా అభియాన్‌లో విదులు నిర్వహిస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేయాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రతి సిఆర్‌పి ఉద్యోగుకి ఉద్యోగ నియామకాల్లో వెయిటేజి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.వికారాబాద్ జిల్లాలోని ఎస్ఎస్ఎ ఉద్యోగులు అందరూ విదిగా మహసభలో పాల్గొనాలని హక్కుల సాదనకై ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఆర్‌పి ఉద్యోగులు ఊరడి మహిపాల్,మల్‌రెడ్డిపల్లి కృష్ణయ్య,రాజు,మెసెంజర్ గుంటి రాములు తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు యూనిట్‌ను ప్రారంభించిన ప్రశాంత్‌రెడ్డి

**యాచారం, జనవరి 25 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర బుధవారం నాలుగవ రోజు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కొనసాగింది. యాత్ర సందర్భంగా ఆయన గడప గడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన కావలి జంగమ్మకు ముఖ్యమంత్రి కెసిఆర్ మానస పుత్రిక అయిన దళిత బంధు పథకంలో భాగంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంజూరు చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ స్టోర్‌ను ఆయన ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం - 3కు పక్కా భవనం మంజూరు కాకపోవడంతో భవన నిర్మాణం కోసం రూ. 5 లక్షలు, డ్వాక్రా నూతన భవన నిర్మాణం కోసం రూ. 10 లక్షలు మంజూరు చేశారు. సిసి రోడ్డు నిర్మాణం కోసం మరో రూ. 5 లక్షలు మంజూరు చేయించారు.అదే విధంగా గ్రామానికి సరిహద్దులో నిర్వహిస్తున్నటువంటి ఫ్యాక్టరీని ఈ ఏడా డిసెంబర్ నెల చివరి వరకు తప్పకుండా మూయిస్తామని, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో మాట్లాడి భవిష్యత్‌లో మళ్లీ అనుమతి రాకుండా చూస్తా నని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యద ర్శి పాశ్చ భాష, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ హబీబుద్దీన్, ఎంపిటిసి సుమతమ్మ లోహిత్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కొంగళ్ల యాదగిరి,వార్డు సభ్యులు జంగమ్మ, కాలే రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శంకర్,తల్లారి మల్లేష్, నాయకులు రాజు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రగతి నివేదన యాత్ర సందర్భంగా చిన్నారితో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

## అదుపుతప్పి కారు బోల్తా..సైనికుడు మృతి

### -మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



సైనికుడు వెంకటేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**కొడంగల్,జనవరి 25ప్రభాతవార్త**
అదుపుతప్పి కారు బోల్తాపడిన సంఘటనలో ఓ సైనికుడు మృతి చెందగా మరో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన నూతన దుద్యాల మండల పరిధిలోని ఆలేడ్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది.సంఘటనకు సంబందించి ఎస్సై రవిగౌడ్ కథనం మేరకు..ఆలేడ్ గ్రామానికి చెందిన బద్సు వెంకటేష్ (24) ఆర్మీలో గత నాలుగు సంవత్సరాలుగా సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.ప్రస్తుతం హర్యానా రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ సెలవులో భాగంగా ఈనెల 9న స్వగ్రామం దుద్యాలకు రావడం జరిగింది. కాగా మంగళవారం తన స్వంత కారు సర్వీసింగ్ చేయించే నిమిత్తం తన ఇద్దరు స్నేహితులు శ్రీనివాస్‌రెడ్డి,ఉదయ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి తాండూర్‌కు వెళ్లడం జరిగింది.కారు సర్వీసింగ్ అనంతరం తిరిగి అదే కారులో స్వగ్రామం ఆలేడ్‌కు వస్తుండగా మార్గమధ్యంలో ఆలేడ్ గ్రామసమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి బోల్తాపడింది.సంఘటనలో సైనికుడు వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందగా మిగితా ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు.సంఘటనపై మృతుడి తండ్రి బద్సు చెంద్రప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే:**
అదుపు తప్పి కారు బోల్తాపడిన సంఘటనలో సైనికుడు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం ఆలేడ్ గ్రామానికి చేరుకొని బద్సు వెంకటేష్ మృతదేహానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ఒదార్చారు.ఎమ్మెల్యే వెంట కొడంగల్ మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్,బీఆర్ఎస్ నాయకులు దత్తురెడ్డి,ముక్తార్,సర్పంచ్ పకీరప్పలతో పాటు రిటైర్డ్ సైనికులు వెంకటయ్య తదితరులున్నారు.

## జాతీయ సమైక్యత స్ఫూర్తిని పెంపొందించాలి



ఘట్‌కేసర్ గురుకుల్ మైదానంలో జనగణమనగీతాన్ని ఆలపిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్, జనవరి 25, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ గురుకుల్ మైదానంలో బుధవారం సామూహిక జాతీయ గీతాలాపాన చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా యువ నాయకుడు బాలుయాదవ్ ఆశ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వి.అశోక్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డిలు విచ్చేసి యువత, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ జనగణమన గీతాన్ని ఆలపించారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేస్తూ దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించగా జనవరి 26 నుంచి గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వందలాది మందితో ఇక్కడ జనగణమన గీతాన్ని ఆలపించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఎస్ఐ మన్నె విజయకృష్ణమూర్తి, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, బేతాల నర్సింగ్‌రావు, అవుషాపూర్ ఉపసర్పంచ్ ఎలసాని అయిలయ్యయాదవ్, మండల బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, వార్డుసభ్యులు బొడిగె శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బర్ల హరిశంకర్, మచ్చేంధర్‌రెడ్డి, పల్లె విజయ్‌గౌడ్, సీఎం.సిరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి వాహనం బోల్తా...

### -ఒకరు మృతి, మరో ఇద్దరికి గాయాలు..

**దౌల్తాబాద్,జనవరి 25,ప్రభాతవార్త:**
ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా,మరో ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారంనాడు దౌల్తాబాద్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు,మండలంలోని చెల్లాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బోలేరా ట్రాలీ వాహనంలో బయలుదేరి జాతరకు వెళుతుండగా దౌల్తాబాద్ గ్రామ సమీపంలో అదుపుతప్పి బోలోరో వాహనం బోల్తాపడిందని పోలీసులు తెలిపారు.వాహనంలో ఉన్న రెడ్డిరాజు (30) అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా వద్ది బుద్యప్ప(34)కు కాలు విరిగిందని పోలీసులు అతనిని వెంటనే అంబులెన్స్‌లో కొడంగల్‌కు తరలించారు.బుద్యప్ప భార్య కూడా గాయపడ్డారని పోలీసులు తెలిపారు.వాహనం నడుపుతున్న డ్రైవర్ పారిపోయాడని చెప్పారు.మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఇట్టికేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ దేవదాస్ తెలిపారు.

# ఘనంగా ఓటర్ల దినోత్సవం



ముగ్గులను తిలకిస్తున్న తహసీల్దార్, డిటి, ఆర్ఐ, ప్రిన్సిపాల్ తదితరులు



కోట్‌పల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న కోట్‌పల్లి తహశీల్దార్, అస్పాక్ రసూల్,మండల విద్యాధికారి చంద్రప్ప

**పెద్దేముల్ మండలంలో**

**పెద్దేముల్, జనవరి 25, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని, అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించు కోవాలని మండల తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. బుదవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పెద్దేముల్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్ఐ రాజీరెడ్డి అధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులను తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, డిప్యూటి తహసిల్దార్ మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ నర్సిములు తిలకించి విజేతలకు బహుమతులు ప్రధానం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతిఒక్కరు ఓటు హక్కును తప్పనిసరి కలిగియుండాలని అన్నారు. అందుకు తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఊపిరి లాంటిదని, అందుకు ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు జమీల్, అన్వర్, ఆసిఫ్,రమేష్,ఉపాధ్యాయులు బందెయ్య,సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

**కోట్‌పల్లి,బంట్వారం మండలంలో**

**కోట్‌పల్లి,జనవరి 25, ప్రభాతవార్త;** కోట్‌పల్లి,బంట్వారం మండల కేంద్రాలల్లో బుధవారం నాడు జాతీయ ఓటర్లు దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు ఓటుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కోట్‌పల్లి, బంట్వారం, తహశీల్దార్‌లు అస్పాక్‌రసూల్, శ్రీనివాస్‌రెడ్డిలు, మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు అయుధం అని అన్నారు. ఓటు అనేది ప్రతి పౌరుడు హక్కు అని దేశ పౌరులందరు తమ ఓటు హక్కును వినియోగించుకోని తమ సమస్యలను తీర్చే నాయకులను ఎన్నోకోవచ్చాన్నారు. మన భారతదేశంలో 18, సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఓటు హక్కు పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు, అందరు ప్రతిజ్ఞ చేశారు. భారతదేశ పౌరులమయిన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మనదేశ సాంప్రదాయాలను స్వేచ్ఛాయుత నిష్పక్షపాత ప్రశాంత ఎన్నికల ప్రభవాన్ని నిలబెడతామని మతం,జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులను ప్రభవితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందుములంగా ప్రతిజ్ఞ చేస్తున్నామని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో కోట్‌పల్లి డిప్యూటి తహశీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీఓ లక్ష్మినారాయణ, కోట్‌పల్లి,బంట్వారం మండల విద్యాధికారి చంద్రప్ప, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నిత్యం బాలీశ్వరయ్య, బంట్వారం ఎంపీడీఓ బాలయ్య, బంట్వారం పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఆర్ఐ తుల్జారామ్, బందయ్య, బంట్వారం సర్పంచు లావణ్య శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుదర్శన్, తుకారాం, సీఆర్‌పీ నర్సిములు, తదితరులు పాల్గొన్నారు,

**బొంరాస్‌పేట్ మండలంలో**

**బొంరాస్‌పేట్,జనవరి25,ప్రభాతవార్త :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో తహసీల్దార్ షర్మిల అధ్వర్యంలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు."భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను,స్వేచ్ఛయుత,నిష్పక్షపాత,ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని,మతం, జాతి,కులం,వర్గం,భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు చేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము"అంటూ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి,నరేష్,సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఆర్ఓ షర్మిల



పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గులను పరిశీలిస్తున్న తహసీల్దార్,ప్రజాప్రతినిధులు

**పరిగిలో**

**పరిగి జనవరి25,ప్రభాతవార్త :** పరిగి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నా ఓటు నా భవిష్యత్తు ఒక్క ఓటు శక్తి అనే థీమ్ ద్వారా ప్రజాస్వామాన్ని బలోపేతం చేయడానికి నినాదాలు ముగ్గులపోటీన్ని నిర్వహించారు. అందులో ముగ్గురికి మొదటి ,రెండవ ,మూడవ బహుమతులు ప్రదాన చేశారు.ఈ సందర్భంగా పలువురు ఓటర్ దినోత్సవంలో భాగంగా ఓటు యొక్క విలువ గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపిపి కరణం అరవింద్ రావు,చైర్మన్ ముకుంద అశోక్, వార్డు కౌన్సిలర్లు,సర్పంచ్‌లు,శేషగిరి శర్మ,ఎంపిడివో ,సిబ్బంది,బిఎల్ఓలు,తదితరులు పాల్గొన్నారు.

# నియోకజవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే మైనంపల్లి

## వినాయక్‌నగర్ డివిజన్‌లో 1కోటి 32లక్షలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరేడ్‌మెట్ జనవరి 25 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజక వర్గంలోని డివిజన్లను పూర్తి స్థాయిలో చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధి లోని వినాయక్‌నగర్ డివిజన్ వినాయక్‌నగర్, అనంతనగర్, వినోభనగర్ ప్రాంతాల్లో రూ. 1కోటి 32లక్షలతో నూతనంగా చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, అధికారులు, స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎదు ర్కుంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే తన లక్ష్యమన్నా రు. ప్రజలు తనపై పెట్టకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కోసం నిరతంరం పాటు పడతానన్నారు. అంతేకాకుండా నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, డీఇ లౌక్య, ఏఈ సత్యలక్ష్మి, నాయకులు పిట్ల శ్రీనివాస్, ఓంప్రకాష్, సూరి, ఉపేందర్‌రెడ్డి, ఫరీద్, ప్రభాకర్ రెడ్డి, బాలక్రిష్ణ గుప్త, ఆగమయ్య, సంతోష్, రాందాస్, సంతోష్, మోహన్‌రెడ్డి, పిట్ల నాగరాజు, లత, చంద్రకాంత్, ఆరుంధతి పాల్గొన్నారు.

**ఈస్ట్, వెస్ట్ కాకతీయనగర్ శ్మశాన వాటిక పరిశీలన:** ఈస్ట్ కాకతీయనగర్, వెస్ట్ కాకతీయ నగర్ గ్రేవీ యార్డులను కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. శ్మశాన వాటికలో మౌలిక వసతుల రూపకల్పనకు కృషి చేస్తామన్నారు.

## ఉప్పల్‌లో సిసి రోడ్డు పనులు : ఎమ్మెల్యే



ఉప్పల్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 25 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో రూ.77లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొ రేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ మాల్ మైసమ్మ దేవాలయం మార్గంలో సిసి రోడ్డు, ఉప్పల్ బస్టాండ్ వెనుక గాంధీనగర్‌లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో పెండిం గ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, వేముల సంతోష్‌రెడ్డి, మస్కు సుధాకర్,టంటం వీరేష్, కాంగ్రెస్ పార్టీ నేతలు బోరంపేట కృష్ణ, ఈగ పాండు, బాకారం లక్ష్మణ్, ఈగ అంజయ్య, పండ్ల బాలయ్య, ఈగ బాబు, మహంకాళి రాజు, శేఖర్‌రెడ్డి, ఉల్వారాజు, సల్ల ప్రభాకర్‌రెడ్డి, గొరిగె జహంగీర్, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రామంతాపూర్ డివిజన్‌లో...** రామంతాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ది పనులను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ప్రారంభించారు. రూ.70లక్షల తో ప్రగతినగర్, పాతరామంతాపూర్‌లో సిసి రోడ్లు, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు, వరద నీటి కాలువ పనులను ప్రారంభించి పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు టంకశాల అశోక్ నివసిస్తున్న ఇంటి వద్ద రోడ్డు వేయిస్తున్నా మని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకు లు బన్నాల ప్రవీణ్, కార్యదర్శి కె.జగన్, రామానుజం, మహేందర్, బింగి శ్రీనివాస్, నారాయణరెడ్డి, రమేష్, బాలు, షెహనాజ్, సత్యవతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యను పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 25 ప్రభాతవార్త :** త్రాగునీటి సమస్య ను అధికారులు వెంటనే పరిష్కరించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్కెపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ బంజారాబస్తీలో మంచినీటి లో డ్రైనేజీ మురుగునీరు కలిసి మంచినీరు కలుషితం అవుతున్నాయని స్థానిక బస్తీవాసులు చిలుక ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన ఉపేందర్‌రెడ్డి బుధవారం వెంటనే బస్తీకి వెళ్లి సమస్య తీవ్రతను పరిశీలిం చారు. వెంటనే స్థానిక బస్తీ ప్రజలతో జలమండలి అధికారు లకు సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన అధికారి తక్షణమే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఉపేందర్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తలాటి రమేష్‌నేత, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్, పగడాల శ్రీశైలం, విజయ్, జహంగీర్, జగదీష్, నగేష్, బస్తీ వాసులు భాస్కర్‌నాయక్, ప్రేమ్‌నాయక్, హరినాయక్, దశరథనాయక్, రవినాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి కృషి : అంజేయగౌడ్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట, జనవరి 25 ప్రభాతవార్త :** క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని స్పోర్ట్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 17వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతుల అం దజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల కు అందుబాటులో ఉండి వారికి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుంద ని అన్నారు. 19 ప్లస్ విభాగంలో శ్రవణ్, రాహుల్ మొదటి బహుమతి, జనిత్, నిఖిల్ ద్వితీయ బహుమతి, మజహర్, విగ్నేష్‌లు 3వ బహుమతి, 35 ప్లస్ విభాగంలో అశోక్, రాజ్‌కుమార్ మొదటి బహుమతి, సురేష్, శ్రీనివాస్‌లు ద్వి తీయ బహుమతి, కుద్దుస్, గణేష్‌లు 3వ బహుమతి, 45 ప్లస్ విభాగంలో మధు, కృష్ణ మొదటి బహుమతి, ప్రసాద్, సుబ్బు ద్వితీయ బహుమతి, భార్గవ్, ఆనంద్ బాబు 3వ బహుమతి సాధించిన వారికి బహుమతులు అందజేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఛైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడు దేవిడి శ్రీనివాస్‌రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, అనిల్, వెంకటేషం, వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజుగో పాల్, జక్క మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తీగల అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్రనగర్‌లో సిసి రోడ్డు పనులు



సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్

**ఉప్పల్, జనవరి 25 ప్రభాతవార్త :** చిలుకానగర్ రాఘవేంద్ర నగర్ కాలనీ, సీతారామకాలనీ తదితర ప్రాంతాల్లో చేపడు తున్న వరద నీటి కాలువ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీతారామకాలనీ ఎన్టీఆర్ఐ ప్రహరిగోడ నుంచి రాఘవేంద్రనగర్, వినాయక టెంపుల్ వరకు వరద నీటి కాలువ పనులు, రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు. డివిజన్ అభివృద్ధి పనుల కోసం తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు టంకశాల అశోక్ నివసిస్తున్న ఇంటి వద్ద రోడ్డు వేయిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, కార్యదర్శి కె.జగన్, రామానుజం, మహేందర్, బింగి శ్రీనివాస్, నారాయణరెడ్డి, రమేష్, బాలు, షెహనాజ్, సత్యవతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి



ఉప్పల్ యూత్ కాంగ్రెస్ నేతలకు నియామక పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 24 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ యూత్ కాంగ్రెస్ కమిటి బలోపేతానికి తగు చర్యలు తీసుకుంటున్నా మని స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం డివిజన్ యూత్‌కాంగ్రెస్ కమిటి నేతలకు ఆమె నియామక పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటిని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉప్పల్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా సత్తు ప్రశాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ గా ఈగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లసాగరం సాయికుమార్, సంయుక్త కార్యదర్శిగా మైనంపల్లి కిషోర్, కార్యదర్శిగా ఎన్.మహేందర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి గా ఊట్ల చంద్రశేఖర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మోత్కూరి శ్రీహిత్‌శర్మలను నియమించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ ఆదేశాల మేరకు కొత్త కమిటిని ఎన్నుకున్నామని తెలిపారు. ఉప్పల్‌లో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**తుర్కయంజాల్, జనవరి 25 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 13వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భం గా ఉపాధ్యాయుల, బిఎల్‌వోలు నూతన ఓటర్లచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటర్ కార్డుల పంపిణీ చేశా రు. లిస్ట్‌లో తప్పులు ఉంటే తప్పులు సరి చేసుకోవాలన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు గెలుపొందిన వారికి బహుమ తులు అందించడంతోపాటు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బిఎల్‌వోలు పేర్కొన్నారు.

## ఈ నెల 29వ తేదీనుండి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**మలక్‌పేట, జనవరి 25 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ ఎస్‌బి ఐ ఆఫీసర్స్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి (24వ) చతుర్వింశతి బ్రహ్మోత్సవాలు, శ్రీ శివ పార్వతిఅమ్మవార్ల (15వ) పంచదశ బ్రహ్మోత్సవాలు, ద్వితీ య మహాకుంభాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు 29వ తేదీనుండి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పూర్ణచంద్రారావు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## కమిషనర్ షాబేర్ అలీకి నేతల సత్కారం

**తుర్కయంజాల్, జనవరి 25 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీకి నూతనంగా వచ్చిన కమిషనర్ షాబేర్ అలీని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్‌నాయక్, మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు భాగ్యమ్మధనరాజ్, కీర్తనవిజయానంద్‌రెడ్డి, వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, తాళ్లపల్లి సంగీతమోహన్‌గుప్తాలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు.

## మల్కాజిగిరిలో జాతీయ ఓటర్ల దినోత్సవం

**నేరేడ్‌మెట్ జనవరి 25 ప్రభాతవార్త:** జాతీయ ఓటర్ల దినో త్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ శైలజ పాల్గొని ప్రసంగించారు. 18సంలు నిండిన యువతీ, యువకులు తమపేరును ఓటరు కార్డులు నమోదు చేసుకోవాలని సూచించారు. అంబేద్కర్ రూపొందించిన భార త రాజ్యాంగంలో పొందుపరిచిన ఒక మనిషికి ఒక ఓటు అనే ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ రాజు, జాతీయ సేవా విభాగం అధికారి డాక్టర్ రమేష్, జి. మల్లిక, ప్రభుత్వ పాటన విభాగాధిపతి డాక్టర్ చంద్రయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ నియోజక వర్గంలోని అన్ని కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే పాదయాత్ర చేసిన సరస్వతినగర్ కాలనీ, పిండి నారాయణరెడ్డి కాలనీ, భాగ్యనగర్ ఫేజ్-1, 2, నార్త్ ఎక్స్‌టెన్షన్, శ్రీరామఅయోధ్యనగర్, తుల్జాభవాని నగర్, సత్యదేవ్ ఎన్‌క్లేవ్‌ల కాలనీవాసులతో అధికారులతో కలసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా కాలనీలలో నూతన రోడ్లు, త్రాగునీరు, త్రీ ఫేజ్ కరెంటు ఎక్కడెక్కడ అవసరమో అధికారులు వెంటనే గుర్తించి పను లు మంజూరు అయ్యేలా చూడాలన్నారు. అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గజ్జెల మధుసూధన్‌రెడ్డి, సత్యంచారి, ఉదయ్‌రెడ్డి, శ్రీనివాస్ నాయక్, దేరంగుల కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, నాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీ చింపడంపై కార్పొరేటర్ ఆగ్రహం



ఫ్లెక్సీ చింపివేసిన దృశ్యం

**ఎల్.బి.నగర్, జనవరి 25 ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవా న్ని పురస్కరించుకొని వేసిన ఫ్లెక్స్‌ను కేవలం గంట వ్యవధిలోనే చింపివేయడం పట్ల సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత డబ్బా కొట్టుకోవడం కాకుండా జాతీయ భవంతో వేసిన ఫ్లెక్సీని తొల గించడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్ర శ్నించారు. రౌడీయిజం, గుండాయిజం చేసేవాళ్ళు రాజకీయా లలోకి ఎందుకు వస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహేశ్వర నియోజకవర్గంలో తన రాజకీయ ఎదుగుదల ఎదు గుదలను చూసి ఓర్వలేకే ఫ్లెక్సీని చింపి వేశారని, జాతీయ భావాన్ని కూడా మరిచి చింపేయడం తమకు బాధ కలిగిస్తుం దన్నారు. నియోజకవర్గంలో శ్రీవాణి తమకు పోటీగా మారిం దని సొంత పార్టీవారే చింపివేసినట్లు చర్చ జరుగుతుంది.

## జిఓ 317 తో రంగారెడ్డి జిల్లా వాసులకు అన్యాయం: గోవర్ధన్ యాదవ్

**సైదాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** పూర్వపు రంగారెడ్డి జిల్లా స్పౌజ్ ఉపాధ్యాయులు, జిల్లాలో కలిపిన మండలాల స్పౌజ్ ఉపాధ్యాయులు తప్పా రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డిజిల్లాకు స్పౌజ్‌ద్వారా వచ్చే ఉపాధ్యాయుల ను ప్రభుత్వం వెంటనే ఆపాలని పిఆర్‌టియు టిఎస్ రంగా రెడ్డిజిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ కోరారు. రంగారెడ్డి జిల్లాలో పుట్టి పెరిగిన ఉపాధ్యాయులను ఇతర జిల్లాలకు కేటాయించి స్థానికేతరులుగా మార్చారని, ఇప్పుడే మే స్పౌజ్ పేరుతో రాష్ట్రంలోని భార్యభర్తలందరిని రంగారెడ్డి జిల్లాలోనే కలుపుతామని అనడం దారుణమని అన్నారు. స్థానికంగా ఖాళీలు లేవనే రంగారెడ్డి జిల్లా వాసులను ఇతర జిల్లాలకు కేటాయించి, ఇప్పుడు ఇతరజిల్లాల స్పౌజ్ ఉపాధ్యా యులను జిల్లాకు తేవడానికి ఖాళీలు ఎక్కడ నుంచి వచ్చాయ ని ఆయన ప్రశ్నించారు. అధికారులు చేసే పొరబాటు వల్ల రంగారెడ్డి జిల్లాలోని స్థానిక ఉపాధ్యాయులతో పాటు భవిష్య త్తులో రంగారెడ్డి జిల్లా నుంచి ఉపాధ్యాయులు కావాలనుకునే వారు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రమోషన్లు రావని, ఒక్కసారి కూడా హెచ్ఆర్ఎ ప్రాంతంలో పనిచేసే అవకాశం దక్కదని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సరిదిద్దాలని ఆయన కోరారు.

## అంజనికుమారికి గిడుగు రామ్మూర్తి సేవా పురస్కారం



అంజనికుమారికి పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ రాధారాణి

**మలక్‌పేట, జనవరి 25 ప్రభాతవార్త :** నగరంలో సిఎస్సీ కోర్టు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పివిపి అంజనికుమారికి గిడుగు రామ్మూర్తి పంతులు సేవా పురస్కా రాన్ని అందజేశారు. గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిడుగు 83వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా అంజనికుమారి చేస్తున్న సేవలను గుర్తించి గిడుగు రామ్మూర్తి పంతులు సేవా పురస్కారాన్ని తెలంగాణ హైకోర్టు జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి చేతుల మీదుగా ఆమెకు అందజేసి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం అంజనికుమారి మాట్లాడుతూ ఈ పురస్కారంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని సమాజా నికి తనవంతుగా మరిన్ని సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

## నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్యే మైనంపల్లి, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ నూతన కార్యవర్గం

**మల్కాజిగిరి, జనవరి 25 ప్రభాతవార్త :** ఈస్ట్‌ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సమక్షంలో దేవాల య నూతనకార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసారు. ఛైర్మన్‌గా మధవిముత్యంరెడ్డి, ధర్మకర్తలుగా, సుబ్బారావు, పద్మజా, శ్రీశైలం, అంకిత్‌కుమార్‌లచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు, ఉపేందర్ ఉమాపతి, బ్రమ్మయ్య, మల్లేష్, బాలకిషన్, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు

# చిలుకానగర్ డివిజన్‌లో ఆగిపోయిన శంకుస్థాపనలు..!

## శిలాఫలకాలు ముస్తాబు : నేతలు రాక నిలిచిన పనులు



శంకుస్థాపన కోసం సిద్ధం చేసిన శిలాఫలకం

**ఉప్పల్, జనవరి 25 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో బుధవారం చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు అకారణంగా నిలిచిపోయాయి. డివిజన్ పరిధిలో బుధవారం బీరప్పగడ్డ లక్ష్మినారాయణస్వామి దేవాలయం వద్ద వరద నీటి కాలువ పనులు, సిసిరోడ్డు పనులు, అదే విధంగా చిలుకానగర్ గుట్ట వద్ద వరదనీటికాలువ పనులు ప్రారంభించాల్సి ఉంది. ఇందు కోసం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రెస్ నోట్ విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు శంకుస్థాపన చేస్తారని ప్రకటించడంతో మున్సిపల్ అధికారులు శిలాఫలకాలు సిద్ధం చేసి పూజలకు రంగం సిద్ధం చేశారు. కొందరు అధికార పార్టీ నేతలు శిలాఫలకాలు ఉన్న చోట్ల హడావిడి చేసి ఏర్పాట్లు పరిశీలించారు. అయితే ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఉప్పల్ డివిజన్‌లో పలుఅభివృద్దిపనులు ప్రారంభించేందుకు వచ్చినా చిలుకానగర్ డివిజన్‌కు రాకుండా రామంతాపూర్‌కు వెళ్లిపో యారు. దీంతో అప్పటి వరకు హడావిడి చేసిన నేతలు ఏమి జరిగిందో తెలియక అయోమయంలో పడ్డారు. గత కొద్ది రోజు లుగా అధికార పార్టీ నేతల మధ్య జరుగుతున్న అంతరుద్యం శంకుస్థాపనలు నిలిచిపోయేందుకు కారణం అయ్యిందని కొందరు పేర్కొంటుండగా, మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యేకు అపాయిమెంట్ ఉందని, అందుకే శంకుస్థాపనలు వాయిదా వేశామని మరికొందరు నేతలు పేర్కొంటున్నారు. అయితే ఇటీవల చిలుకానగర్ డివిజన్‌లో నగర మేయర్ గద్వాల విజ యలక్ష్మిని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి వర్గీయులు అడ్డుకోవడం కొంత వివాదానికి దారితీసిన విష యంతెలిసిందే. అప్పట్లో ఎమ్మెల్యే లేకుండా ప్రారంభోత్సవాలు ఎలా చేస్తారంటూ కొందరు అధికార పార్టీ నేతలు మేయర్‌ను అడ్డుకు న్నారు. అప్పట్లో బిఆర్ఎస్ పార్టీ నేతలు పరస్పరం విమర్శలు చేసుకున్నారు. తిరిగి మరోసారి చిలుకానగర్ డివిజన్‌లో చేపట్టా ల్సిన పనులు ఆగిపోవడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తు న్నారు. బీరప్పగడ్డ కమ్యూనిటిహాల్‌కు వెళ్లే రహదారిని తవ్వి పది రోజులు గడుస్తున్నా నేతల రాకపోవడంతో పనులు చేపట్టడం లేదు. ఇదిలా ఉండగా అధికార పార్టీ నేతల వైఖరితో మున్సిపల్ అధికారులు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. ఎవరితో పనులు ప్రారంభించాలో, ఎవరిని ఆహ్వానించాలో తెలియక మిన్నకుండిపోతున్నారు. శంకుస్థాపన కార్యక్రమాలకు వస్తున్న అధికారులు ఫోటోలకు కూడా దూరంగా ఉండి తప్పించుకుంటున్నారు. రాజకీయ పార్టీల నేతలో తమకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా రాజకీయ పార్టీ నేతల వైఖరితో పనులు వాయిదా వేయడం సరికాదని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

# ఇళ్ల స్థలాలిస్తామనే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి

## దళారులపై ఆధారాలతో సీపీఐ నాయకులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలి

**హయత్‌నగర్, జనవరి 25 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్‌గ్రామపరిధి పాపయ్యగూడ భూదాన భూముల్లో ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసే దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి తెలిపారు. బుధవారం పాపయగూడలో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో వారు మాట్లాడుతూ పాపయ్య గూడ సర్వేనెంబరు 215 నుంచి 224 వరకు గల భూదాన భూముల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలన్న దృఢ సంకల్పంతో సీపీఐ భూపోరాటాన్ని కొనసాగిస్తోందన్నారు. భూదాన బోర్డు మాజీ ఛైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అతని అనుచరులు పాతతేదీల్లో పట్టాలిచ్చినట్లుగా నకిలీ ప్రొసీడింగ్ పత్రాలను సృష్టించి అక్రమ మార్గంలో అమాయక ప్రజలను మభ్యపెట్టి లక్షల రూపాయలకు స్థలాలను విక్రయిస్తూ దందా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో భూపోరాటంలో గుడిసెలు వేసుకున్నవారివద్దకు వెళ్లి డబ్బులు ఇస్తే ప్రొసీడిం గులు ఇస్తామని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి అక్రమ దాందాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోంద న్నారు. 50యేళ్లుగా రికార్డులలో 100 ఎకరాల స్థలాలు భూ దాన భూములుగా ఉన్నాయని కోర్టుల్లో కేసులు నడుస్తున్నా యని తెలిపారు. బోగస్ ప్రొసీడింగులతో అక్రమ మార్గంలో వ్యాపారాలు చేయాలని చూసేవారిపై సీపీఐ నాయకులకు, పోలీసులకు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మౌళిక సదుపాయాల కల్పనే ద్యేయం : ఛైర్‌పర్సన్ స్వప్న



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ స్వప్న తదితరులు

**హయత్‌నగర్, జనవరి 25 ప్రభాతవార్త:** వార్డులవారిగా ప్రజ లకు కనీస మౌళిక సదుపాయాలను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులో 5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సీసీరోడ్డు పనులకు ఆమె వైస్ ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, స్థానిక కౌన్సిలర్ జోర్కగీత, కమిషనర్ సత్యనారాయణరెడ్డితో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ స్యలతీవ్రతను బట్టి నిధులను కేటాయించి అభివృద్ధి పనుల ను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఒరుగంటి సుజాత, మున్సిపల్ డీఈఈ అశోక్‌కుమార్, నాయకులు చామ విజయశేఖర్‌రెడ్డి, చెవుల చిరంజీవి, జోర్కశ్రీరాములు, కొండల్‌గౌడ్ పాల్గొన్నారు.

## నాచారం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించిన రాగిడి లక్ష్మారెడ్డి



స్థానికులతో సమస్యలను తెలుసుకుంటున్న రాగిడి లక్ష్మారెడ్డి

**నాచారం, జనవరి 25 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధి లోని ఇందిరానగర్, తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి నాయకులు,కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో హోం మంత్రి ఇక్కడికి వచ్చి మైనార్టీల కోసం స్మశాన వాటికను ఏర్పాటు చేయిస్తామని చెప్పినా నేటికి ఈ సమస్య తీరలేదని రాగిడి ఆరోపించారు. ఇందిరానగర్‌లో దోమలసమస్య ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. స్థానిక సమస్యలపై డీఈతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**సంస్మరణ సభలో పాల్గొన్న రాగిడి ...** ఇటీవల రోడ్డు ప్రమా దంలో మృతి చెందిన కాంగ్రెస్ యువనాయకుడు ముసలి సందీప్ సంస్మరణ సభలో రాగిడి పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మేడల మల్లికార్జున్, ఎండి అశూ, మోహన్, అలిమ్, యూసూఫ్, హాజీ ము స్తాన్, అజీమ్, జహంగీర్, ముస్తాన్, జిలాని, షకిల్, జలీల్, సాజిద్, అయూబ్, ఫియస్, గణేష్ నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలి : పవన్

**ఎల్.బి.నగర్,జనవరి 25 ప్రభాతవార్త :** ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఐదేళ్ల చిన్నారి విద్యుత్ తీగలను పట్టుకోవ డంతో విద్యుద్ఘాతానికి గురైన సంఘటన కొత్తపేట బస్తీలో జరిగింది. సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ వారిఇంటికి వెళ్లి తల్లితండ్రులను చిన్నారి యోగక్షేమాలు తెలుసుకున్నా రు. అనంతరం కొత్తపేట విద్యుత్ ఏఈ జాన్సన్‌ని పిలిపించి బస్తీలో ప్రమాదకరంగా ఉన్న తీగలను, స్తంభాలను మార్చా లని మళ్ళీ ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని బస్తీలో ప్రమాదకరంగా ఉన్న స్థంబాలను చూపించారు. అదేవిధంగా డిఈ రామకృష్ణ ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోర్లపల్లీ స్వామి, శివనేత, సుందర్, యూ.రామకృష్ణ, తిరుమల్, మహేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడలు విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచుతాయి : ఇన్‌స్పెక్టర్ నాగమల్లు



ఇన్‌స్పెక్టర్ నాగమల్లుకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

**మలక్‌పేట, జనవరి 25 ప్రభాతవార్త :** క్రీడలు విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచుతాయని ఎల్‌బినగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు, భాష్యం విద్యా సంస్థల జోనల్ ఇంఛార్జి అంకమ రావు, ప్రిన్సిపల్ పల్లవి పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ భాష్యం లో విద్యార్థులు నిర్వహించిన క్రీడోత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతివిద్యార్థి పాఠ్యాంశాలతోపాటు క్రీడల పై ఆసక్తి చూపించాలన్నారు. క్రీడలతో మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. క్రీడల్లో గెలుపొందినవారికి బహుమతు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రిన్సిపల్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగంతోనే సుపరిపాలన : కార్పొరేటర్లు అరుణ, శ్వేత



ఓటర్లచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ అరుణ



ఓటర్లచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** జాతీయ ఓటర్ల దినోత్స వాని న్ని పురస్కరించుకుని సైదాబాద్ డివిజన్‌లోని మూడు గుళ్లు, కళ్యాణ్‌నగర్‌లలో జరిగిన కార్యక్రమాలలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారానే మనకు నచ్చిన పాలకులను ఎన్నుకోగలుతామన్నా రు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావు, సోని, శ్రీలత, పావని, లీల, గోవింద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఐఎస్ సదన్ డివిజన్‌లో...** ఐఎస్ సదన్ డివిజన్ సంఘం లక్ష్మీభాయి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొ రేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వీరేంద్రబాబు, శరత్ చంద్ర, సుధీర్, అజయ్, జిహెచ్ఎంసి అధికారులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెయింట్ డామ్నిక్స్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

**సైదాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** సెయింట్ డామ్నిక్స్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్సిస్టిట్యూషన్స్ నిర్వాహణలోని కర్మన్‌ఘాట్ డైసీ ఫ్లవర్ స్కూల్, లెర్నింగ్ ట్రీ ప్రీ ప్రైమరి పాఠశాలల వార్షికోత్సవంసందర్భంగా 'తరంగ్' పేరుతో నిర్వ హించిన సంబరాలు అంబరాన్నంటాయి. డామ్నిక్స్ కరస్పాం డెంట్ పి.అంకితారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సమగ్రాభివృద్ధి దిశగా, విద్యావిధానంలో వస్తున్న అధునాతన పద్దతులకు అనుగుణంగా తమ పాఠశాలలో బోధన ఉంటుందన్నారు. విద్యాభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలకు తల్లిదండ్రులు మరింతగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మేజర్, మోటివేటెడ్ స్పీకర్ సిస్టా, అనురాగ్ విద్యా సంస్థల డైరెక్టర్ ప్రొఫెసర్ మహిపతి శ్రీనివాస్, చైల్డ్ సైకాలజిస్ట్ విజయ అంబటి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.